క్లుప్తంగా

ఘనంగా కుంకుమపూజ



పూజల్లో పాల్గొన్న మహిళలు

కాసిపేట: మండలంలోని రేగులగూడలో సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం కుంకుమపూజ నిర్వహించారు. మహిళలు సీతారామస్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు కొడప లలిత, కొడప సంజన కృష్ణకుమార్ దంపతులు పూజలో పాల్గొన్నారు. పూజారి లచ్చన్న, మడావి శంకర్, యశ్వంత్‌రావు, గేడం వాసుదేవ్, గణపతి, శర్మ తదితరులున్నారు.

జెండాలు కట్టనివ్వొద్దు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండాలు, బ్యానర్లు కట్టకుండా చర్యలు తీసుకోవాలని శుక్రవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో అన్ని చౌరస్తాల్లో సుందరీకరణ పనులు పూర్తయినా అంబేడ్కర్ కూడలిలో జాప్యం చేయటం తగదని పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

మసీదులో సన్మానం



ముగ్గురిని సన్మానిస్తున్న మత పెద్దలు

జన్నారం: జన్నారం పంచాయతీ పరిధి మహ్మదీయ మసీదులో రంజాన్‌ను పురస్కరించుకుని ఖురాన్ కంఠస్థం చేసిన ముగ్గురిని ముస్లింలు మత పెద్దలు సన్మానించారు. జన్నారం పంచాయతీకి చెందిన నిస్సార్ అహ్మద్ ముగ్గురు కుమారులు అహ్మద్ సోహెల్, అబ్దుల్ రజాక్, ఉవేస్‌తో శుక్రవారం మసీదులో ఖురాన్ పఠనం చేయించాడు. భావం చెప్పించాడు. దీంతో మత పెద్దలు మక్సూద్ షమీం, ఖుర్షీద్ సల్మాన్‌ఖాన్, ఇక్బాల్ అలీం హాజ్ ఈ సందర్భంగా తండ్రితో పాటుగా ముగ్గురు కుమారులను సన్మానించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పున్నంచందు

భీమారం: చిన్న పోశం స్మారకార్థం భీమారంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను నిర్వాహకుడు ఉస్కమల్ల పున్నంచందు శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులకు గుండు తిరుపతి దుస్తులు అందజేశారు. నాయకులు గుండు తిరుపతి, కొత్త సత్తిరెడ్డి, శివ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో వేదపండితులు, భక్తులు

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లిలో నిర్మించిన అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితుడు కిరణ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారం

తాండూర్: మండలంలోని రాజీవ్‌నగర్ పంచాయతీ పరిధిలో ఇటీవల వేసిన బోరు చుట్టూ మురుగునీరు చేరిన విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాస్ వెంటనే స్పందించారు. శుక్రవారం అక్కడికి చేరుకుని పంచాయతీ సిబ్బందితో బోరు చుట్టూ గద్దె కట్టించారు. సుభద్ర కాలనీలో పైపులైన్ లీకేజీ విషయం తెలుసుకుని వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేయించారు. కత్తెర్ల గ్రామంలో బోరు మరమ్మతు చేపట్టారు. శుక్రవారం వివిధ సమస్యలకు పరిష్కారం చూపి అందరి మన్ననలు అందుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తపస్, సిబ్బంది ఉన్నారు.

ఇళ్లు ఇచ్చేదెప్పుడో!

- గతేడాది మార్చి 17వ తేదీన డ్రా
- 330 మంది లబ్ధిదారుల ఎంపిక
- నేటికీ అందని డబుల్ బెడ్రూంలు
- సామగ్రి ఎత్తుకెళ్తున్న దుండగులు



జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడంలేదు. గత ప్రభుత్వం గతేడాది మార్చి 17వ తేదీన కలెక్టర్ బదావత్ సంతోష్ ఆధ్వర్యంలో వేంపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా నిర్వహించింది. ఎంపికైన లబ్ధిదారులకు ఏడాది పూర్తయినా నేటికీ ఇళ్లు అప్పగించలేదు. అన్ని రకాల వసతులతో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో ఎవరూ నివాసం ఉండక పోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇళ్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. రోజంతా పశువులు అడ్డాగా మార్చుకుంటుండగా, రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. వీటిని పరిరక్షించేవారు లేక ఈ దుస్థితి ఉంది. మరికొన్నాళ్లు గడిస్తే ఇళ్లు నివాస యోగ్యానికి పనికి రాకుండా పోయే అవకాశం లేకపోలేదు.



పగిలిన కిటికీ అద్దాలు

330 మంది ఎంపిక

గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలో 650 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో 360 నిర్మాణాలు పూర్తయ్యాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చిన 30 కుటుంబాలకు గతంలోనే 30 ఇళ్లు మంజూరు చేశారు. మిగతా 330 ఇళ్ల పంపిణీకి అర్హుల ఎంపిక జాబితాను రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్, సిబ్బంది చేపట్టారు. ఐదువేల మందికిపైగా దరఖాస్తు చేసుకోగా, మొదట 2,958 మందిని అర్హులుగా గుర్తించారు. మండల రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు రెండుసార్లు సర్వే నిర్వహించిన తర్వాత అర్హులు 1,616 మంది ఉన్నట్లు గుర్తించి వారికి టోకెన్లు అందించారు. గతేడాది మార్చి 17వ తేదీన కలెక్టర్ అధ్యక్షతన టోకెన్లు తీసుకున్న వారి సమక్షంలోనే లక్కీ డ్రా తీసి 330 మందిని ఎంపిక చేశారు. స్థలం ఉన్నవారు, ఒకే ఇంట్లో ఇద్దరు లక్కీ డ్రాలో ఇళ్లు పొందారని ఆధారాలతో పలువురు ఫిర్యాదు చేయగా, 50 మంది స్వచ్ఛందంగా ఇళ్లు వదులుకున్నారు. కానీ.. అన్ని అర్హతలు ఉన్నవారికి మాత్రం ఇప్పటివరకు ఇళ్లు అప్పగించలేదు.

పట్టించుకోకుంటే వృథానే..

డబుల్ బెడ్రూం ఇళ్లను రాజీవ్‌నగర్‌లోని పట్టణ శివారు ప్రాంతంలో నిర్మించారు. ఈ ఇళ్లను రక్షించేందుకు ఎవరినీ నియమించలేదు. వాటికి వేసిన తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. దీంతో పశువులు ఇళ్లలో సేద తీరుతున్నాయి. పలువురు అసాంఘిక చర్యలకు అడ్డాలుగా మార్చుకున్నారు. దుండగులు తలుపులు విరగ్గొడుతున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం వేసిన పైపులు, ట్యాప్‌లను ఎత్తుకెళ్తున్నారు. ఫ్లోరింగ్‌ను పగులగొడుతున్నారు. ఇళ్ల కిటికీలు, తలుపుల అద్దాలు ధ్వంసం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బెల్లంపల్లి: రాంజీగోండు విద్యార్థి నిలయం, వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలో గ్రామీణులకు సీతారాముల విగ్రహాలు పంపిణీ చేశారు. గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు కనుల పండువగా జరుపుకోవాలని నిర్వాహకులు సూచించారు. అందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంజీగోండు విద్యార్థి నిలయం అధ్యక్షుడు కొడిప్యాక విద్యాసాగర్, కార్యదర్శి కాసర్ల తిరుపతి, సభ్యురాలు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీల్లో కలుషిత నీరే దిక్కు



కేకే-5 సమీపంలోని ఫిల్టర్‌బెడ్

- ఇబ్బందుల్లో కార్మిక కుటుంబాలు
- పట్టించుకోని యాజమాన్యం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి ప్రాంత కాలనీల్లో పరిశుభ్రమైన తాగునీరు సరఫరా కాకపోవడంతో కార్మిక కుటుంబాలకు కలుషితనీరే దిక్కవుతోంది. కార్మిక కాలనీల్లో సింగరేణి సరఫరా చేసే వాటర్ పైపుల్లో మురుగునీరు సరఫరా అవుతోందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆయా కాలనీలవారు వాపోతున్నారు. సింగరేణి సరఫరా చేసే తాగునీటితో అనేక మంది కిడ్నీ సంబంధిత రోగాలతో బాధపడుతున్నారని ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ ప్లాంట్ల నుంచి వాటర్ తెప్పించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఫిల్టర్‌బెడ్‌లోనే కలుషితం..

మందమర్రి ఏరియాలో సింగరేణి కాలనీలైన 1, 2, 3 జోన్లు, ప్రాణహిత కాలనీ షిర్కే, రామన్ కాలనీ, నాగార్జున కాలనీ తదితర కాలనీల్లో సింగరేణి కుటుంబాలున్నాయి. వీరికి కేకే-5 గని సమీపంలోని ఫిల్టర్ బెడ్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఈ ఫిల్టర్ బెడ్‌కు నస్పూర్ వద్ద గోదావరి నది నుంచి నీరు సరఫరా అవుతుంది. ఇక్కడి ఫిల్టర్ బెడ్ నుంచి కేకే-5 సమీపంలోని మరో ఫిల్టర్ బెడ్, అలాగే కేకే-3 ఫిల్టర్ బెడ్‌కు, కేకే-2 ఏరియా ఫిల్టర్‌బెడ్‌లకు నీరు సరఫరా అవుతోంది. గోదావరి నది నుంచి పైపులైన్ ద్వారా సరఫరా అయిన వాటర్ క్లోరినేషన్ చేసినప్పటికీ ఫిల్టర్ బెడ్‌లోని పైపుల్లోనే కలుషితమై మురుగునీరు సింగరేణి కాలనీలకు సరఫరా అవుతోంది. గతంలో యాజమాన్యం సివిల్ అధికారుల సమక్షంలో ఏరియా హెల్త్ ఆఫీసర్ ఫిల్టర్ బెడ్‌లోని నీటిని వారం, పదిరోజులకోసారి పరీక్షలకు పంపేవారు. ప్రస్తుతం నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ విషయమై ఇంజినీర్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు. గతంలో కార్మిక సంఘం, సాధారణ ఎన్నికల్లో నాయకులు కాలనీలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చి మరిచారు. ఇప్పటికైనా నాయకులు, యాజమాన్యం స్పందించి పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

మందమర్రి ఏరియాలోని సింగరేణి కాలనీల్లో కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది. ఏరియాలోని కాలనీల్లో కలుషితనీరు సరఫరా అవుతోందని ఇదివరకే సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాం. గతంలో ఏరియాలో తాగునీటిని సరఫరా చేసే ఫిల్టర్‌బెడ్‌ల నుంచి హెల్త్ ఆఫీసర్ శాంపిల్ కోసం నీటిని ప్రయోగశాలకు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం అలా జరగడం లేదు. తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్‌లో కలుషిత నీరు లేకుండా నిబంధనల ప్రకారం ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన నీటిని కార్మిక కుటుంబాలకు సరఫరా చేయాలి.

– సత్యనారాయణ,
ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి, మందమర్రి

నేడు విద్యుత్ అంతరాయం

కాసిపేట: 33/11కేవీ కొండపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8నుంచి 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. గమనించాలని సూచించారు.

నెన్నెల: నిర్వహణ నిమిత్తం నెన్నెల, ఆవుడం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8నుంచి 10గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ మల్లయ్య తెలిపారు. 11కేవీ కోసం కోణంపేట ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా కోణంపేట, మన్నెగూడం, ఖర్జీ, జంగాల్‌పేట, కుశ్నపల్లి, బొప్పారం గ్రామాలకు ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధి లోని గ్రామాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మ హేందర్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాల నుంచి గఢ్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వేలొద్ది వరకు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గఢ్‌పూర్ సబ్‌స్టేషన్ పరి ధిలోని ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్, పెద్ద గోపాల్‌పూర్, ముత్రిగూడెం, దు బ్బగూడెం, బాబానగర్, గఢ్‌పూర్ గ్రామాలకు శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలకు శనివారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తాండూర్: తాండూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బోయపల్లి, చౌటపల్లి, ఐబీ, మాదారం, రేపల్లెవాడ, అబ్బాపూర్, బెజ్జాల గ్రామాల్లో ఉదయం 8నుంచి 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ పట్టణం, మండలంలో శనివారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. చె న్నూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని చెన్నూర్ పట్ట ణం, గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

జైపూర్: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా జైపూర్, ఇందారం, కుందారం, పొనూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మందమర్రిరూరల్: 11 కేవీ టౌన్-2 లైన్‌లో మరమ్మతుల కారణంగా మందమర్రిలోని నార్లాపూర్, మార్కెట్‌ఏరియా, దీపక్‌నగర్, పాలచెట్టు ఏరియా, స్టేషన్‌రోడ్డు, గాంధీనగర్, దొరలబంగ్లాస్ ఏరియా, ఎంఎల్‌ఏ కాలనీల్లో శనివారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మల్లేశం తెలిపారు. పాలచెట్టు ఏరియా సబ్‌స్టేషన్ పరిధిలోని సారంగపల్లి, శంకర్‌పల్లి, చిర్రకుంట, ఆదిల్‌పేట్, పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లోనూ అంతరాయం ఉంటుందని రామకృష్ణాపూర్ విద్యుత్ ఏఈ జయకృష్ణ పేర్కొన్నారు.

శ్రీరాంపూర్: నస్పూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రామ్మూర్తి తెలిపారు. గమనించాలని కోరారు.

నూతన నియామకం



శ్రీదేవి

మంచిర్యాలటౌన్: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా మంచిర్యాల పట్టణానికి చెందిన జోగుల శ్రీదేవిని రెండోసారి నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి శుక్రవారం నియామక పత్రాన్ని అందించారు. వరుసగా తనను రెండోసారి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమించినందుకు శ్రీదేవి జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల లొల్లి



చైర్మన్‌తో వాదిస్తున్న తల్లిదండ్రులు

దండేపల్లి: మేదరిపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల లొల్లి వివాదాస్పదమైంది. పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నపుడు వ్యవస్థాపక చైర్మన్ సత్యనారాయణ ప్రమేయం లేకుండా సిబ్బంది ఫీజు విషయంలో కొందరు విద్యార్థులకు కొంత డిస్కౌంట్ ఇచ్చారు. ఈ డిస్కౌంట్ పోను తల్లిదండ్రులు మిగతా ఫీజు చెల్లించి పిల్లలను చేర్పించారు. ప్రస్తుతం వార్షిక పరీక్షల సమయంలో పూర్తి ఫీజు చెల్లిస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని వ్యవస్థాపక చైర్మన్ చెప్పారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఫీజుల చెల్లింపు విషయంపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవస్థాపక చైర్మన్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయన డిస్కౌంట్ విషయం సిబ్బంది తన దృష్టికి తేలేదని తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. డిస్కౌంట్ పోను మిగతా ఫీజు చెల్లించాలని కోరగా వివాదం సద్దుమణిగింది.

జైపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జైపూర్: జైపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు బయట ఏ అవసరమున్నా ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాలని సూచించారు. మంచిర్యాల–చెన్నూర్, శివ్వారం మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం జైపూర్ బస్టాండ్ వద్ద చల్లటి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

బీజేపీలో చేరిన యువత



పార్టీలో చేరిన వారితో రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్, నంనూర్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు శుక్రవారం బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన పలువురు యువకులు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరగా రఘునాథ్ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సమష్టిగా ముందుకు సాగాలని రఘునాథ్ కోరారు.

పని ప్రదేశాల్లోనే వసతులు



- గ్రామపంచాయతీలకు బాధ్యతలు
- ఈజీఎస్ ద్వారా జీపీలకు బిల్లులు
- తీరనున్న కూలీల ఇబ్బందులు

పాతమంచిర్యాల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో కూలీలకు తాగునీటి కోసం ప్రభుత్వం రూ.2 భత్యంగా ఇచ్చేది. కానీ, రెండు సంవత్సరాలుగా నీటి భత్యం లేకపోవడంతో కూలీలు ఎవరి తాగునీరు వారు తీసుకుని వస్తున్నారు. ఎండలకు సేదతీరడానికి టెంట్ వసతి కూడా కల్పించకపోవడంతో కూలీలు చెట్లకిందే సేదతీరేవారు. కానీ, ఉపాధి కూలీల కోసం ఎండాకాలంలో తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పించే బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకనుంచి ఉపాధి పనులు నిర్వహించే చోట టెంట్, తాగునీటిని గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ కూలీకి 2 లీటర్ల తాగునీటికి రూ.2.50, టెంట్ వసతి కల్పించనున్నారు. పని స్థలాల్లో వసతులు కల్పించినందుకు ఉపాధిహామీ అధికారులు గ్రామపంచాయతీలకు బిల్లులు చెల్లించనున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉపాధిహామీ పని స్థలాల్లో వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయనున్నట్లు ఉపాధిహామీ అధికారులు తెలిపారు. కాగా, గతంలో కూలీలకు పార, గడ్డపార, తట్టలు, మెడికల్ కిట్లు, టెంట్ ప్రభుత్వం సరఫరా చేసేది. కానీ, 2018 నుంచి పనిముట్లు సరఫరా కావడంలేదు. దీంతో తామే పనిముట్లు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.

వసతులు కల్పిస్తాం

ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ వసతి కల్పించే బాధ్యత గ్రామపంచాయతీలకు అప్పగించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారులు ఆదేశానుసారం కూలీలు పనిచేసే చోట వసతులు కల్పించడానికి జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి విధివిధానాలపై అవగాహన కల్పిస్తాం. కూలీలు వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా వారికి తాగునీరు, నీడ వసతి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. – కిషన్, డీఆర్డీవో

భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు



కుంకుమపూజకు అధికసంఖ్యలో హాజరైన మహిళలు

శ్రీరాంపూర్: శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీరాంపూర్ కాలనీలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం కుంకుమపూజ నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ భవనంలో పూజలు

చెన్నూర్: పట్టణంలోని విశ్వకర్మ భవనంలో ఏర్పాటు చేసిన మహమ్మయిదేవి వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సురేశ్‌బాబు, కార్యదర్శి కత్రోజు చంద్రశేఖర్, పురోహితులు ఏలేశ్వరం రమేశ్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

భీమారం: ఇటీవల భీమారం పెట్రోల్‌పంప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండల కోఆప్షన్ సభ్యుడు బాబర్‌ఖాన్‌ను కాంగ్రెస్ నాయకుడు గుండు తిరుపతి శుక్రవారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఆలయ పనుల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: స్థానిక గౌతమీనగర్, రాళ్లపేట్‌రోడ్ నంబర్-1లో చేపట్టిన శివపంచాయతన సహిత అభయాంజనేయ సరస్వతీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెల 19నుంచి 21వ తదీ వరకు ఆలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం పనులు పరిశీలించారు.

సదస్సులు నిర్వహించాలి

వేమనపల్లి: షెడ్యూల్డ్ కులాల పారిశ్రామికాభివృద్ధి కోసం అవగాహన సదస్సులు నిర్వహించాలని మండలానికి చెందిన ఓయూ జేఏసీ నాయకుడు దుర్గం మల్లేశ్ డీఐసీసీఐ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ, కో ఆర్డినేటర్ దాసరి నారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువత పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలనే అంశంపై చర్చించినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

లక్సెట్టిపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామ మాల మహానాడు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు గరిసె రవీందర్, కార్యదర్శి బైరం లింగన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా కోడి చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కోడి రత్నయ్య, సైనిక్‌దళ్ అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా అజయ్, బొల్లం వంశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.